క్లుప్తంగా

72 మందికి వైద్యసేవలు

గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ సేవాభవన్‌లో ఆదివారం ఉచిత మధుమేహ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 72 మంది రోగులకు గుడివాడ వైద్యురాలు డాక్టర్ గద్దెని రజిని వైద్య పరీక్షలు చేశారు. లయన్స్ చైర్మన్ నాగేశ్వరరావు మాట్లాడుతూ రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేశామని పేర్కొన్నారు. అనంతరం లయన్స్ సేవాభవన్‌లో వంద మంది పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు లయన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు కానుకల లెక్కింపు

పమిడిముక్కల: మంటాడ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం ఉదయం 10 గంటలకు హుండీల్లో కానుకలను లెక్కిస్తామని ఆలయ ఈవో మాధవీలత ఆదివారం తెలిపారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ అధికారుల సమక్షంలో లెక్కింపు జరుగుతుందని, ఆసక్తి గల భక్తులు లెక్కింపులో పాల్గొనవచ్చని తెలిపారు.

'ఎన్టీఆర్ శతకం' ఆవిష్కరణ

గుడివాడ టౌన్: తెలుగువారి గుండెల్లో చిరస్మరణీయుడిగా ఎన్టీఆర్ ఉండిపోతారని కృష్ణా జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు అన్నారు. స్థానిక వాసవీచౌక్‌లోని ఆర్యవైశ్య కల్యాణ మందిరంలో ఆదివారం తెలుగు భాషా వికాస్ సమితి ఆధ్వర్యంలో రఘు రచించిన ఎన్టీఆర్ శతకం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ ఎంతమంది రచయితలు రాసినా ఎన్టీఆర్ చరిత్ర ఇంకా మిగిలే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ స్టేడియం సంయుక్త కార్యదర్శి పర్వతనేని ఆనంద్, ఎల్. ఈశ్వర వెంకటేశ్వరరావు, గాదె మోహన్‌బాబు, సమితి సంయుక్త కార్యదర్శి డీఆర్‌బీ ప్రసాద్, మోకా మాధవరావు, వంగా శ్రీనివాస్, సయ్యద్ అలి తదితరులు పాల్గొన్నారు.

నాలుగు తరాల అపూర్వ కలయిక



పామర్రు: స్థానిక విష్ణాలయంలోని కల్యాణ మండపంలో రొంపిచర్ల ఇంటిపేరు కలిగిన నాలుగు తరాల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. ఆట పాటలతో ఎంతో ఉత్సాహంగా ఉల్లాసంగా గెట్ టు గెదర్ కార్యక్రమం నిర్వహించారు. రొంపిచర్ల చిన శేషాచార్యులు, శేషమ్మ దంపతులకు సంబంధించిన నాలుగు తరాల కుటుంబ సభ్యులు అందరూ ఒక్క చోట చేరి ఆట పాటలతో సరదాగా గడిపారు. అమెరికా, బెంగళూరు, మంగళూరు, హైదరాబాద్, విశాఖ పట్నం, తిరుపతి, విజయవాడ, మచిలీపట్నం తదితర ప్రాంతాల్లో ఉండే వీరందరూ ఒక్క చోట చేరారు. చిన్నారులు నృత్యాలు చేస్తూ ఉల్లాసంగా గడిపారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. రానున్న కాలంలో గ్రామాభివృద్ధికి కృషి చేస్తామని తీర్మానించుకున్నారు. కార్యక్రమంలో రొంపిచర్ల ప్రభాకర్ నారాయణాచార్యులు,ఆర్.నారాయణాచార్యులు, లక్ష్మి, ఆర్. భార్గవి, రాధ, విశాలక్ష్మి పాల్గొన్నారు.

ఇంటింటా జాతీయ జెండా



గుడివాడ టౌన్ (నందివాడ): ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటా జాతీయ జెండా ఎగురవేయాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం ఇంటింటా జాతీయ జెండా కార్యక్రమాన్ని నందివాడ సర్పంచ్ సరెళ్ల రత్నకుమారి నివాసం నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ హర్ ఘర్ తిరంగ్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరిలో జాతీయభావాన్ని పెంపొందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పెయ్యల ఆదాం, ఎంపీడీఓ కేపీ కోటేశ్వరరావు, గ్రామ కార్యదర్శి రామ్మోహనరావు, వైఎస్సార్ సీపీ నాయకులు సరెళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ.1,00,116 విరాళం



పామర్రు: స్థానిక విష్ణాలయం అభివృద్ధికి దాతలు విరాళాలను ఆలయ కమిటీ సభ్యులకు ఆదివారం అందజేశారు. ప్రముఖ వైద్యులు రొంపిచర్ల బాల కృష్ణ మాచార్యులు, వరలక్ష్మి దంపతుల జ్ఞాపకార్థం కుమారుడు కర్నాటక రాష్ట్రం మంగుళూరు వాస్తవ్యులు రొంపిచర్ల నారాయణాచార్యులు, లక్ష్మి దంపతులు, డాక్టర్ ఆర్ ప్రభాకర్ నారాచార్యులు చేతుల మీదుగా ఆలయ కమిటీకి రూ.1,00,116 విరాళంగా అందజేశారు. ఆలయానికి ప్రహరీ, ఫ్లోరింగ్ తదితర అవసరాలకు వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు ఆర్.భార్గవి, ఆర్. రాధ, ఆర్ విశాలక్ష్మి, ఆర్.విజయకృష్ణ ప్రసాద్, ఆలయ కమిటీ సభ్యులు కొల్లి సత్యనారాయణరెడ్డి, బొమ్మారెడ్డి రామకృష్ణారెడ్డి, తమ్మా సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

మహిళలకు ఆర్థిక ఊతం

- మహిళల ఆర్థిక స్వావలంబనకు సున్నావడ్డీ జమ
- నియోజకవర్గంలో మహిళలకు నాలుగో విడత నిధులు
- 10,814 డ్వాక్రా గ్రూపులకు రూ.9.27 కోట్లు



సున్నావడ్డీ చెక్కును అందజేస్తున్న ప్రజాప్రతినిధులు(ఫైల్)

గుడివాడరూరల్: మహిళల ఆర్థికాభ్యున్నతికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ అక్కచెల్లెమ్మలకు సున్నా వడ్డీ చెల్లింపు పథకాన్ని ప్రతి ఏడాది క్రమం తప్పకుండా చెల్లిస్తున్నారు. వరుసగా నాలుగో విడత పంపిణీ ఈనెల 11వ తేదీన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డ్వాక్రా మహిళల ఖాతాల్లో జమ చేశారు.

నియోజకవర్గానికి రూ.9.27 కోట్లు..

గుడివాడ నియోజకవర్గంలోని గుడివాడ, నందివాడ, గుడ్లవల్లేరు మండలాల్లో ఉన్న 10,814 గ్రూపులకు రూ.9.27కోట్లు మేర సున్నా వడ్డీ రూపంలో చెల్లించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలకు ముందు పాదయాత్రలో భాగంగా ఎన్నికల మేనిఫెస్టో ప్రకటించారు. డ్వాక్రా గ్రూపు సభ్యులకు బ్యాంక్‌లు ఇచ్చిన రుణాలకు వడ్డీ చెల్లింపు లేకుండా ప్రభుత్వమే చెల్లించే విధంగా సున్నా వడ్డీ ఇస్తానని ప్రకటించారు. అధికారంలోకి రాగానే ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ మహిళల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నారు. దీంతో డ్వాక్రా మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గత ప్రభుత్వంలో...

గత ప్రభుత్వ హయంలో డ్వాక్రా మహిళలకు రుణాలు ఇచ్చి వడ్డీతో సహా బ్యాంక్‌లు వసూలు చేసేవారు. మహిళలకు పసుపు-కుంకుమ పేరిట కన్నీళ్లు తుడవటానికి రూ.10 వేలు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ఈ పథకాల వల్ల మహిళలకు ఒరిగిందేమి లేదు. బ్యాంక్‌లకు వడ్డీ, చక్రవడ్డీతో సహా చెల్లింపులు చేయడానికి నానా ఇబ్బందులు పడేవారు.

2019-20 : మొదటి విడత..

మండలాలు	గ్రూపులు	సభ్యులు	చెల్లించింది రూ.లక్షల్లో
గుడివాడ	649	6490	రూ.39.94
నందివాడ	746	7460	రూ.55.62
గుడ్లవల్లేరు	976	9760	రూ.84.86

2020-21: 2వ విడత..

మండలాలు	గ్రూపులు	సభ్యులు	చెల్లించింది రూ.లక్షల్లో
గుడివాడ	774	7740	రూ.44.72
నందివాడ	804	8040	రూ.45.66
గుడ్లవల్లేరు	1061	10610	రూ.75.29

2021-22 : 3వ విడత..

మండలాలు	గ్రూపులు	సభ్యులు	చెల్లించింది రూ.లక్షల్లో
గుడివాడ	917	9170	రూ.64.9
నందివాడ	1030	10300	రూ.72.75
గుడ్లవల్లేరు	1086	10860	రూ.89.65

2022-2023 : 4వ విడత

మండలాలు	గ్రూపులు	సభ్యులు	చెల్లించిన నగదు
గుడివాడ	835	8350	రూ.6.71 కోట్లు
నందివాడ	970	9770	రూ.1.17 కోట్లు
గుడ్లవల్లేరు	966	9660	రూ.1.39 కోట్లు
మొత్తం			రూ.9.27 కోట్లు

సున్నావడ్డీ పథకం డ్వాక్రా మహిళలకు వరం..



సున్నావడ్డీ పథకం మహిళలకు వరంలా మారింది. గత ప్రభుత్వాల హయంలో తీసుకున్న రుణాలు చెల్లించలేక ఇబ్బందిపడేవాళ్లం. గతంలో తీసుకున్న రుణాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సున్నావడ్డీ పథకాన్ని ప్రకటించి సులువుగా తీర్చుకునేలా చేశారు. ఆయనకు డ్వాక్రా మహిళలు అండగా ఉంటారు. సున్నావడ్డీ పథకాన్ని డ్వాక్రా మహిళలకు ఎటువంటి ఆటంకాలు లేకుండా అందచేస్తాం..

-నాగమల్లి, దొండపాడు, గుడివాడ మండలం

ఖాతాల్లో జమ చేస్తున్నాం



గుడివాడ నియోజకవర్గ పరిధిలోని మూడు మండలాల్లో సున్నా వడ్డీ పథకాన్ని డ్వాక్రా మహిళలకు మూడో విడత ఎటువంటి ఆటంకాలు లేకుండా అందజేశాం. నాలుగో విడత ఈనెల 11వ తేదీన విడుదల చేశారు. మహిళలకు సున్నావడ్డీ పథకం నిధులను వారివారి ఖాతాల్లో జమ చేస్తున్నాం. ఆర్థిక అభివృద్ధికి ఈ నిధులను వినియోగించుకోవాలి.

-డీటీ సుందరరావు, వెలుగు ఏరియా కోఆర్డినేటర్

సంస్కృతీ సంప్రదాయాలను కాపాడాలి



కమిటీ సభ్యులతో జిల్లాల సహ కన్వీనర్ అరవింద్

పామర్రు: మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఉందని, గ్రామాల్లో హిందూ ధర్మాన్ని ప్రచారం చేయాలని విశ్వహిందూ పరిషత్ కృష్ణాజిల్లా సహ కన్వీనర్ అరవింద్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో సభ్యుల సమావేశం ఆదివారం నిర్వహించారు. అనంతరం పామర్రు మండల కమిటీ సభ్యులను ఎంపిక చేశారు. మండల కమిటీ కన్వీనర్లుగా పానుగుమాటి లక్ష్మణ, దేగల బాబూరావు, పువ్వాడ శ్రీనివాసరావు, తాళ్లూరినరేష్, బొమ్మారెడ్డి కోటిరెడ్డి, అరిగెల బాలుడు, సభ్యులుగా కె.భాను ప్రకాష్, పి.నరసింహారావు, ఎస్.నాగ సాయి, వంకా భవాని, నందగోపాల్‌లను ఎంపిక చేశారు.

పెన్షన్ పథకాలను వినియోగించుకోండి



అవగాహన కల్పిస్తున్న మేనేజర్ దుర్గారావు

మండవల్లి : అటల్ పెన్షన్ యోజన పథకంలో చేరి ప్రతి నెలా రూ.10 వేలు గ్యారంటీ పెన్షన్‌తో వృద్ధాప్యాన్ని సురక్షితం చేసుకోవాలని స్థానిక ఇండియన్ బ్యాంకు మేనేజర్ బొంతు దుర్గారావు, ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు అన్నారు. మండలంలోని కానుకొల్లులో ఆదివారం ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక మండల శాఖ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ సామాజిక పథకాలైన జీవనజ్యోతి, బీమా యోజన, పెన్షన్ యోజనపై ఆదివారం ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. పాస్టర్ కంతేటి థామస్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. దుర్గారావు, భాస్కరరావు మాట్లాడుతూ 30 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న దంపతులు రెండు అకౌంట్‌లు తెరచి నెలకు రూ.577 చెల్లిస్తే 60 ఏళ్ల తర్వాత నెలకు రూ.10 వేలు పొందవచ్చని తెలిపారు. నామినీకి రూ.17 లక్షలు చెల్లిస్తారని పేర్కొన్నారు. 18 ఏళ్ల వయస్సు వారు నెలకు రూ. 210, 35 వయస్సు అయితే రూ.902 చెల్లిస్తే సరిపోతుందన్నారు. వయస్సును బట్టి ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ పథకం కింద ఇన్వెస్ట్ చేసిన వారు పెట్టుబడిని బట్టి నెలవారీ పెన్షన్‌గా రూ.1000, రూ.5000 వరకు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఇంటి ఝాన్సీరాణి, జి.మహాలక్ష్మి, బి.కరుణ, దానియేలు, బి.సృజన, జి.గోవింద్, షడ్రక్ థామస్ పాల్గొన్నారు.

పాల పొంగళ్లు సమర్పణ



ఈఓ సురేష్‌కు వెండి వస్తువుల్ని అందిస్తున్న మురళీధర్, సృజనకుమారి

గుడ్లవల్లేరు: కొండలమ్మ అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులను చెల్లించుకునేందుకు ఆలయంలో ఆదివారం క్యూలైనుల్లో భక్తులు అధికసంఖ్యలో బారులు తీరారు. అమ్మవారికి మహిళా భక్తులు పాల పొంగళ్లను సమర్పించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాల్ని స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈఓ సురేష్, చైర్మన్ శేషం గోపి తగు ఏర్పాట్లు చేశారు.

వెండి వస్తువుల సమర్పణ

గుడ్లవల్లేరు: కొండలమ్మ అమ్మవారికి మచిలీపటాన్నికి చెందిన ఆర్.వి.ఎస్.మురళీధర్, సృజన కుమారి దంపతులు వెండి వస్తువులను సమర్పించారు. ఆదివారం ఆలయ ఈఓ కానూరి సురేష్‌కు 1,200 గ్రాముల విలువైన వెండి నక్షత్ర హారతి, సర్ప హారతులను అందించారు. ఆ దంపతుల పేరిట అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించి అమ్మవారి చిత్రపటంతో పాటు లడ్డూ ప్రసాదాలను అందించారు.

చదరంగంతో మానసిక వికాసం

టూటౌన్ సీఐ తులసీధర్



చదరంగం పోటీలు ప్రారంభిస్తున్న సీఐ తులసీధర్

గుడివాడ టౌన్: చదరంగం మానసిక వికాసానికి దోహదపడుతుందని టూటౌన్ సీఐ తులసీధర్ అన్నారు. స్థానిక ఎన్టీఆర్ ఇన్‌డోర్ స్టేడియంలో ఆదివారం పాఠశాలల స్థాయి చదరంగం పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచంలో అత్యధిక దేశస్తులు ఆడే క్రీడ చదరంగం ఒక్కటేనన్నారు. చదరంగం ఆడటానికి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రేరేపించాలన్నారు. ప్రపంచంలోని అన్ని క్రీడలకన్నా అతి తక్కువ ఖర్చుతో ఆడే క్రీడ ఇది ఒక్కటేనన్నారు. స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు పాలేటి శివ సుబ్రహ్మణ్యేశ్వర రావు(చంటి) మాట్లాడుతూ చదరంగం క్రీడలో గుడివాడకు ప్రత్యేకత సంతరించుకుందన్నారు. పట్టణానికి చెందిన కోనేరు హంపి, పిన్నమనేని సాహితి అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించిన చరిత్ర పట్టణానికి ఉందన్నారు. స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి పర్వతనేని ఆనంద్, కార్యవర్గ సభ్యులు బొగ్గారపు తిరుపతయ్య, కిలారు రంగప్రసాదు, చింతా రఘుబాబు, క్రీడాకారులు పాల్గొన్నారు.

చేప బెల్లం ద్రావణం తయారీ



చేపబెల్లం తయారీని వివరిస్తున్న డీసీఆర్పీ గౌతమ్‌కుమార్ తదితరులు

మండవల్లి: మండలంలోని అల్లినగరంలో చేపబెల్లం తయారీ విధానాన్ని డిజిటల్ సీఆర్పీ గౌతమ్‌కుమార్ రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయం ఖర్చులను తగ్గించేందుకు ప్రకృతి వ్యవసాయం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ నాగవిజయ, ఐసీఆర్పీ నాగవాణి, రైతులు, ఖాదర్‌ఖాషా పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కైకలూరు : మండలంలోని వరాహపట్నం సబ్ స్టేషన్ పరిధిలో సోమవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టీ రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పవర్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

భక్తిశ్రద్ధలతో అన్నాభిషేకం



స్వామికి అన్నాభిషేకం చేస్తున్న భక్తులు

పామర్రు: స్థానిక అంకమ్మ తల్లి దేవస్థానంలోని రేణుకా పరమేశ్వరునికి ఆదివారం ఘనంగా అన్నాభిషేకం నిర్వహించారు. తొలుత ఆలయంలో స్వామికి పంచామృతాలతో అవుపాలు తదితరాలతో అభిషేకాలు చేశారు. నమక చమకాలతో విశేషంగా అభిషేకం చేశారు. విజయవాడ వాస్తవ్యులు నాగమహేష్ దుర్గారాణి దంపతుల ఆధ్వర్యంలో స్వామికి అన్నాభిషేకం నిర్వహించారు. స్వామికి నిర్వహించిన అన్నాభిషేకం అన్నముతో వచ్చిన భక్తులు అందరికీ అన్న సమారాధన చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వరదా అప్పారావు, కమిటీ సభ్యులు ఉటుకూరి ఉమా మహేశ్వరరావు, మేకా పేరయ్య, తదితరులు పాల్గొన్నారు. రాపర్ల గ్రామంలో గజ్జ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో స్వామికి విశేషంగా అభిషేకాలను అర్చకులు మోహన్, పద్మాకర్ నిర్వహించారు.

బాపట్ల జిల్లాలో జమీదగ్గుమిల్లివాసి మృతి



ఘటనా ప్రదేశంలో మృతదేహం

కర్లపాలెం (పిట్టలవానిపాలెం): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన కర్లపాలెం మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు కర్లపాలెం వైపు నుంచి చందోలు వైపునకు ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఓ వ్యక్తిని తిమ్మారెడ్డిపాలెం సమీపంలో సతీష్ మెరైన్ వద్ద ఎదురుగా వచ్చిన ఓ ఎస్‌యూవీ ఢీకొట్టింది. ఘటనలో కృష్ణా జిల్లా పామర్రు మండలం జమీదగ్గుమిల్లి గ్రామానికి చెందిన గుడివాడ సాయి బాలాజీని ఆస్పత్రికి తరలించేలోపు మరణించాడు. అతని జేబులో ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా మృతుడిని గుర్తించారు. ఈమేరకు కర్లపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్
- భద్రిరాజుపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం



భద్రిరాజుపాలెంలో వృద్ధురాలికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

తోట్లవల్లూరు: ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని పామర్రు ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని భద్రిరాజుపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మూడో రోజైన ఆదివారం ఉత్సాహంగా కొనసాగింది. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే అనిల్‌కుమార్ గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి గత నాలుగేళ్లుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించి, బ్రోచర్లను అందజేశారు. స్థానికుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకోవటంతోపాటు ఆయా సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుకోవాలని అధికారులను ఆదేశించారు. జగనన్న కాలనీలో రోడ్ల అభివృద్ధి, తాగునీటి వసతి కల్పనకు తగిన చర్యలు తీసుకుంటామని అనిల్‌కుమార్ హామీ ఇచ్చారు. ప్రజాసంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సుపరిపాలన సాగిస్తున్నారని ఆయన చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వేల కోట్లు వెచ్చించి ఇళ్ల స్థలాలు పంపిణీ చేయటంతోపాటు జగనన్న కాలనీల పేరుతో ఊళ్లను నిర్మించటం జరుగుతోందన్నారు. ప్రజలకు మెరుగైన, నాణ్యమైన సేవలు ప్రభుత్వం అందిస్తోందని అనిల్‌కుమార్ చెప్పారు. ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, సర్పంచ్ కొక్కిలిగడ్డ హేమలత, మండల పార్టీ అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ కళ్లం శివారెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ నడకుదురు రాజేంద్ర, ఉప సర్పంచ్ దాగంటి తిరుమలరెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు దాగంటి శ్రీనివాసరెడ్డి, జిల్లా యూత్ ప్రధానకార్యదర్శి మోర్ల పూర్ణప్రసాద్, నాయకులు దేవరపల్లి చంద్రశేఖర్, వివిధ గ్రామాల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద మృతులకు ఎమ్మెల్సీ నివాళి



కైకలూరు ప్రభుత్వాసుపత్రి వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వెంకటరమణ

కై కలూరు: ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ ఆదివారం పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ శాతం తలకు దెబ్బతగిలి మరణిస్తున్నారని, అందువలన ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. కలిదిండి, ఇంగిలిపాకల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన ఇరువురి మృతదేహాలను ఆయన ఆదివారం ఆసుపత్రిలో సందర్శించి నివాళులర్పించారు. వారి బంధువులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రయాణ సమయాల్లో తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ముంగర మల్లికార్జున రావు, బలే ఆంజనేయులు, నాగరాజు, జయమంగళ కరుణబాబు తదితరులు ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ వెంట ఉన్నారు.

విద్యార్థుల అ'పూర్వ' సమ్మేళనం



1977-78 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

గుడివాడ టౌన్: తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకునేందుకు స్థానిక అడుసుమిల్లి గోపాల కృష్ణయ్య (ఏజీకే) మున్సిపల్ హైస్కూల్ పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం ఆనందోత్సాహాల మధ్య జరిగింది. 1977-78 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు కలుసుకుని ఉల్లాసంగా..ఉత్సాహంగా గడిపారు. ఒకరినొకరు గుర్తుపట్టలేని స్థితిలో పరిచయం చేసుకున్నారు. కుటుంబాల స్థితిగతులను తెలుసుకున్నారు. ఆనాటి సంగతులను గుర్తుకు తెచ్చుకున్నారు. 45 ఏళ్ల తరువాత తాము తిరిగి కలుసుకోవడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని నిర్వాహకులు అన్నారు. అందుబాటులో ఉన్న ఉపాధ్యాయులను సత్కరించారు.

ప్రారంభోత్సవానికి సిద్ధంగా పీహెచ్‌సీ భవనం



ప్రారంభానికి సిద్ధంగా పీహెచ్‌సీ భవనం

పెదపారుపూడి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నూతన భవన నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. పెదపారుపూడి గ్రామానికి ప్రభుత్వం కొత్తగా పీహెచ్‌సీ మంజూరు చేసింది. అయితే సొంత భవనం లేకపోవటంతో స్థానికులు సమస్యను ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఆయన పై అధికారులతో మాట్లాడి నిధులు మంజూరు చేయించారు. ప్రభుత్వం నాడు-నేడు కింద సుమారు రూ.1.90 కోట్లతో భవన నిర్మాణ పనులు చేట్టారు. భవన నిర్మాణ పనులు 95 శాతంపైగా పూర్తి చేసినట్లు గుడివాడ ఆర్అండ్‌బీ డీఈ డీ కామేశ్వరరావు పేర్కొన్నారు. ఈ నెల చివరి కల్లా భవన నిర్మాణం పూర్తి చేసి ప్రారంభిస్తామని తెలిపారు.

స్థానికుల హర్షం..

పెదపారుపూడిలో నూతన పీహెచ్‌సీ ఏర్పాటు చేసి సుమారు రూ.1.90 కోట్ల నిధులతో పూర్తి చేయటం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో పీహెచ్‌సీ లేకపోవటంతో యలమర్రు, వెంట్రప్రగడ పీహెచ్‌సీలకు వెళ్లాల్సిన పరిస్థితి వచ్చిందని స్థానికులు అంటున్నారు. ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార చొరవతో మండల కేంద్రానికి నూతన భవనంలో పీహెచ్‌సీ ఏర్పాటు చేయడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పేకాట శిబిరంపై దాడి

మోపర్రు(పెదపారుపూడి): మండలంలోని మోపర్రులో పేకాట శిబిరంపై ఆదివారం రాత్రి దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ పల్లా నాగకల్యాణి తెలిపారు. ఈ దాడిలో 9 మంది జూదారులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.5 వేలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.